క్లుప్తంగా

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న విప్



వేములవాడఅర్బన్‌: వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌ బుధవారం వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి ఆశీర్వచనంతో పాటు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు కర్రసాము

సిరిసిల్లకల్చరల్‌: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం కర్రసాము నిర్వహించనున్నట్లు డీఎల్‌ఎస్‌ఏ చైర్మన్‌, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్‌ కళాశాల మైదానంలో ఉదయం 7 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. క్రీడాకారులు, బాలికలు, న్యాయవాదులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ మొగిలి

ఇల్లంతకుంట: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని సిరిసిల్ల రూరల్‌ సీఐ మొగిలి అన్నారు. మండలంలోని సిరికొండ గ్రామంలో బుధవారం సీసీ కెమెరాలను ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ...మండలంలోని అన్నిగ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్‌ నేరాలు, గంజాయి, ట్రాఫిక్‌పై అవగాహన అవగాహన కల్పించారు. దాతల సాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్‌ గౌడ్‌, సిరికొండ వీపీవో హెడ్‌ కానిస్టేబుల్‌ సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు వేలంపై పోలీసుల విచారణ

సాక్షి స్పందన

తంగళ్లపల్లి: మండలంలోని రాళ్లపేట గ్రామ పంచాయతీ పరిధిలో బెల్ట్‌షాపు ద్వారా మద్యం అమ్మేందుకు కొందరు పెద్ద మనుషులు వేలంపాట నిర్వహించారని తెలుపుతూ ×బెల్ట్‌షాపు నిర్వహించేందుకు వేలం?' అనే శీర్షికన బుధవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా పోలీస్‌ అధికారుల ఆదేశంతో రాళ్లపేటలో విచారణ జరిపినట్లు తెలిసింది. బెల్ట్‌షాపు కోసం వేలం వేసింది వాస్తవమేనని, రూ.66 వేలకు వేలంపాడిన వ్యక్తి ఇప్పటికే రూ.33 వేలు చెల్లించినట్లు విచారణలో తేలింది. వేలంపాట నిర్వాహకులపై చర్యలు తీసుకునే అవకాశం ఉండడంతో గ్రామంలో చర్చ మొదలైంది.

బస్సును పునరుద్ధరించాలి

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట నుంచి హైదరాబాద్‌ వెళ్లే బస్సు రెండ్రోజులనుంచి రాకపోవడంతో మండలప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సిద్దిపేట డిపోకుచెందిన బస్సు గాలిపెల్లి నుంచి ఉదయం 5 గంటలకు ఇల్లంతకుంట మీదుగా హైదరాబాద్‌ వెళ్లేది. దుర్గామాత నిమజ్జనం రోజు గా లిపెల్లిలో ఈ బస్సు సైడ్‌ మిర్రర్‌ వాహనం తగిలి పగిలిపోయిందని, కొందరు డ్రైవర్‌తో దురుసుగా మాట్లాడారనే కారణంతో సోమవా రం నుంచి సిద్దిపేట డిపో బస్సు రద్దుచేశారు. దీంతో కరీంనగర్‌ నుంచి హైదరాబాద్‌ వెళ్లే బస్సులో ప్రయాణికులు కిక్కిరిసిపోతున్నారు. సిద్దిపేట డిపో నుంచి ఇల్లంతకుంటకు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. హైదరాబాద్‌ వెళ్లే బ స్సును పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా శివకేశవుల కల్యాణం



ముస్తాబాద్‌: మండలకేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ శివకేశవుల ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ ఉమామహేశ్వరుల కల్యాణ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన రెండు వేర్వేరు మండపాల్లో కల్యాణాన్ని వేదమూర్తులు జరిపించారు. అంతకు ముందు ఎదుర్కోళ్ల ఘట్టం నిర్వహించారు. అమ్మవార్లకు మహిళలు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు పార్థసారథి, హరీశ్‌ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్‌ ఎలు సాని దేవయ్య, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిమాన్వితం.. శ్రీవారి రథోత్సవం





విద్యుత్‌కాంతుల్లో వేంకటేశ్వర స్వామి ఆలయం

- 8 శతాబ్దాల చరిత్ర గల ఆలయం
- భక్తుల కొంగుబంగారం శ్రీవారు
- నేడు సిరిసిల్ల వెంకన్న జాతర

సిరిసిల్లటౌన్‌: భక్తుల కొంగుబంగారం శ్రీశాల వెంకన్న ఆలయం తిరునాళ్ల శోభను సంతరించుకుంది. 800 ఏళ్ల చరిత్ర గల శ్రీవారి కోవెల బ్రహ్మోత్సవ కాంతులీనుతుంది. 9రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వెంకన్నస్వామి జాతర జరగనుంది. లక్షమందికి పైగా పాల్గొనే ఈ జాతర ఈప్రాంతంలో ప్రత్యేకత సంతరించుకుంది.

వెంకన్న క్షేత్ర ప్రాశస్త్యం

శ్రీశాల క్షేత్రంలో శ్రీమహావిష్ణువు స్వయంభూగా వెలిశాడని ఆలయ ప్రాశస్త్యం చెబుతోంది. పూర్వం మానేరునది తీరంలో మాండవ్య మహాముని ఆశ్రమం ఉండేది. ఒకరోజు ఆయన రుషిపుంగవులు, తపస్సుల సూచనలతో శ్రీ మహావిష్ణుయాగం చేయాలని తలపెంచి కఠోర తపస్సును ఆచరిస్తాడు. మునిభక్తి ప్రపత్తులకు మెచ్చి ప్రసన్నుడైన స్వామి, ఇక్కడ ప్రవహించే నదికి కూడా ముని పేరుమీద ప్రాచుర్యంలోకి వస్తుందని, తీరం వెంబడి గ్రామ నిర్మాణంతోపాటు ఆలయ నిర్మాణం కూడా జరుగుతుందని విష్ణుమూర్తి అభయమిస్తాడు. కాలక్రమేణ జమీందారులు, దేశాయిలు ఈ ప్రాంతంలో గ్రామ నిర్మాణానికి పూనుకుంటారు. ఒకరోజు వారికి కలలో స్వామి కనిపించి నూతన గ్రామానికి శ్రీశాలగా నామకరణం చేయాలని ఆదేశించాడు. స్వామి ఆదేశానుసారం గ్రామంతోపాటు కేశవనాథ స్వామి ఆలయం నిర్మితమయ్యాయి.

దేశాయ్‌ వంశస్తులచే నిర్మాణం



శ్రీశాల క్షేత్రానికి చారిత్రాక ప్రాశస్త్యం ఉంది. 1826 ప్రాంతంలో మొఘలులు, కాకతీయుల రాజ్యంపై దండయాత్ర చేసి ధ్వంసం చేసిన ఆలయాల్లో కేశవనాథ స్వామి ఆలయం ఒకటి. వారి దాడిలో ఛిద్రమైన విగ్రహం ఇప్పటికీ ఆలయంలో ఉంది. కొన్నాళ్లకు దేశాయ్‌ వంశీయుడు చెన్నమనేని తుక్కారావు, మీనారావులకు స్వామి ద ర్శనమిచ్చి మాండవ్యనదీ తీరంలోనే యా గం జరిపినప్పటి తన విగ్రహం వజ్రదంతి(బర్రెంక) వృక్షం కింద ఉండిపోయిందని, ఆ చెట్టును ఖననం చేసి ఆలయంలో ప్రతిష్ఠించాలని చెప్పి అంతర్ధానం అయ్యారు. మరుసటి రోజు బర్రెంక వృక్షాన్ని పెకిలించి చూడగా అచ్చం స్వామి విగ్రహాన్ని పోలిన విగ్రహం కనిపిస్తుంది. మహదానందంతో ఆ ప్రతిమను తీసుకొచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఆలయ ప్రాభవం పెరుగుతూ వస్తోంది.

రథోత్సవానికి లక్ష మంది యాత్రికులు

ప్రతీ ఏడాది నిర్వహించే శ్రీవారి రథోత్సవానికి రాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుంచి సుమారు లక్షమంది భక్తులు పాల్గొంటారు. 25 అడుగుల ఎత్తులో ఉండే రథం ఉండడం ఈ ఉత్సవానికి ప్రత్యేకత. ఇక్కడ తొమ్మిది రోజులుగా సాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి రథోత్సవం(జాతర) జరుగనుంది. ఈమేరకు దేవాదాయ, మున్సిపల్‌, సెస్‌, పోలీస్‌శాఖలు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయం చుట్టుపక్కల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. క్యూ లైన్లో నిల్చునే భక్తులకు మంచినీటి సరఫరా..ఆలయ ప్రాంతంలో వైద్యారోగ్యశాఖ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శ్రీవారికి రథంపై దర్శించే భక్తులకు స్పెషల్‌, సాధారణం, వీఐపీ దర్శనాలకై క్యూలైన్ల నిర్మాణాలు పూర్తయ్యాయి

నేడు మంత్రి పొన్నం రాక

సిరిసిల్ల: సిరిసిల్లలో కొనసాగుతున్న శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించే రథోత్సవానికి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ హాజరుకానున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు.

భక్తులకు సకల సౌకర్యాలు



సిరిసిల్లతో పాటు సమీప గ్రామాల ప్రజలు దాదాపు లక్ష మందికి పైగా జాతరలో స్వామి వారిని దర్శించుకుంటారని అంచనా. చలువ పందిళ్లు, మౌలిక వసతులు పూర్తిచేశాం. ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక రథంపై స్వామి వారి దర్శనం ఉంటుంది. భక్తులు మొక్కులు చెల్లించేందుకు రథంపై, ఆలయంలో ప్రత్యేకంగా హుండీలు ఏర్పాటు చేశాం.

– మారుతిరావు, ఆలయ ఈవో

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు

- చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు



రైతులతో మాట్లాడుతున్న సీఐ

చందుర్తి: రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు తప్పవని, రెవెన్యూ అధికారులు కేటాయించిన స్థలాల్లోనే ధాన్యం ఆరబోయాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు కోరారు. మండలకేంద్రంలోని మోత్కురావుపేటకు వెళ్లే తారురోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గతంలో రోడ్డుపై ధాన్యం ఆరబోయడంతో ప్రమాదాలు జరిగి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆదేశాలను పాటించకుండా ధాన్యం పోస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని అన్నిగ్రామాల రైతులు రెవెన్యూ అధికారులు సూచించే స్థలాల్లో ధాన్యం ఆరబోసుకోవాలన్నారు. మండలకేంద్రంలోని రైతులు ప్రభుత్వ స్థలంలో ధాన్యం ఆరబోయాలని తహసీల్దార్‌ శ్రీనివాస్‌తో కలిసి స్థలాన్ని చూపించారు. మాజీ ఎంపీపీ, మండల రైతు సమన్వయ సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య, ఆర్‌ఐ శ్రీనివాస్‌, సర్వేయర్‌, రైతులు ఉన్నారు.

మార్కెట్‌ యార్డులో సౌకర్యాలు కల్పిస్తాం



బోయినపల్లి: వ్యవసాయ మార్కెట్‌ యార్డులోకి ధాన్యం తీతీసుకువచ్చే రైతులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పిస్తామని బోయినపల్లి ఏఎంసీ చైర్మన్‌ బోయిని ఎల్లేశ్‌యాదవ్‌ పేర్కొన్నారు. మార్కెట్‌ కమిటీ కార్యాలయంలో బుధవారం పాలకవర్గం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్యాక్స్‌, డీసీఎమ్మెస్‌ కేంద్రాలకు ఎంఎస్‌పీ పరికరాలు ఇచ్చేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యదర్శి రమణ, వైస్‌ చైర్మన్‌ నిమ్మ వినోద్‌రెడ్డి, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్లు గుడి రాజశేకర్‌రెడ్డి, ఎండీ. బాబు, వెంకటేశ్‌, మహేశ్‌, లచ్చయ్య, ప్రదీప్‌, సతీశ్‌, రమేశ్‌, అజయ్‌, మార్కెట్‌ సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులు కాపాడుకోవాలి



మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

గంభీరావుపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లు తొలగించే ప్రయత్నంలో భాగంగా ఎస్సీలను విడగొట్టి పరిపాలించే కుట్రలు చేస్తున్నాయని మాల మహానాడు ఆఫ్‌ ఇండియా జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం అన్నారు. మండలకేంద్రంలో అంబేడ్కర్‌ విగ్రహం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. దళితులు సంఘటితంగా పోరాడి హక్కులను కాపాడుకోవాలన్నారు. రిజర్వేషన్ల పెంపుకోసం కలిసికట్టుగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. మాలల ఐక్య వేదిక జిల్లా నాయకులు మల్యాల రాజవీర్‌, దోసల శంకర్‌, సుదర్శన్‌, రవి, జీవన్‌, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట: ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన పథకం కింద బుధవారం రూ. 2లక్షల చెక్కును నాఫ్కాబ్‌ చైర్మన్‌ కొండూరు రవీందర్‌రావు అందజేశారు. దమ్మన్నపేట తండాకు చెందిన మూడ్‌ సత్తయ్య ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబానికి చెక్కుల అందజేశారు. ఇక్కడ కేడీసీసీబీ మేనేజర్‌ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్‌ చైర్మన్‌ రామానుజాగౌడ్‌, డైరెక్టర్లు ఉన్నారు.

రేపటి నుంచి రిలేదీక్షలు

సిరిసిల్లటౌన్‌: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో గురువారం నుంచి రిలేదీక్షలు చేపడుతున్నట్లు తాజా మాజీ సర్పంచుల జేఏసీ చైర్మన్‌ అక్కెనపల్లి కరుణాకర్‌ తెలిపారు. బుధవారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2019 నుంచి 2024 వరకు సర్పంచులు తమ గ్రామాల్లో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేయించారని, ఇప్పటికీ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదన్నారు. బిల్లుల కోసం పలుసార్లు ప్రభుత్వానికి విన్నవించినా స్పందించడం లేదన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 18 నుంచి రిలేదీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇక్కడ నాయకులు దుమ్మ అంజయ్య, గణప జ్యోతి తదితరులున్నారు.

కమిటీ ఎన్నిక

కోనరావుపేట: మండల ఉపాధిహామీ ఉద్యోగుల ఫీల్డ్‌ అసిస్టెంట్ల నూతన కమిటీ అధ్యక్షుడిగా తాళ్లపెల్లి శ్రీనివాస్‌ ఉపాధ్యక్షురలిగా సరిత, కోశాధికారిగా తాడు తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా లింబయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా యూనియన్‌ అధ్యక్షుడు నేదూరి మధు, ప్రచార కార్యదర్శి పసుల శేఖర్‌, ప్రధాన కార్యదర్శి హక్కునూరి చంద్రశేఖర్‌, సహాయ కార్యదర్శి నరేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● ఫీజు రీయింబర్స్‌మెంట్‌ అందించాలి

సిరిసిల్లటౌన్‌: ప్రభుత్వం వెంటనే పెండింగ్‌ ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌, స్కాలర్‌షిప్స్‌ అందించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు. సిరిసిల్లలో ఎస్‌ఎఫ్‌ఐ, బీఆర్‌ఎస్‌వీ, టీఎస్‌ఎస్‌ఎఫ్‌ నాయకులు బుధవారం వేర్వేరుగా ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసంపై ప్రభుత్వం ఆటలాడొద్దని హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్‌, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్‌, టీఎస్‌ఎస్‌ఎఫ్‌ నాయకుడు రాజిరెడ్డి పాల్గొన్నారు.

● విద్యార్థులకు అవగాహన

వేములవాడఅర్బన్‌: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బోటని, మైక్రో బయాలజీ విభాగాల ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. పోషక విలువలు, జంక్‌ఫుడ్‌ తినడం వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ శ్రీనివాస రామలింగేశ్వర శర్మ, వైస్‌ ప్రిన్సిపాల్‌ లావణ్య, అధ్యాపకులు దీప్తి, పాతిమా, స్వప్న, విద్యార్థులు తదితరులున్నారు.

● 29లోపు దరఖాస్తు చేసుకోవాలి

సిరిసిల్లకల్చరల్‌: విదేశాల్లో చదివే ఎస్సీ విద్యార్థులకు ప్రభుత్వం తోడ్పాటందిస్తుందని ఎస్సీడీవో విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్‌ ఓవర్సీస్‌ విద్యానిధి పథకం కింద విదేశీ విద్యకోసం రూ.20లక్షల సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. పోస్టు గ్రాడ్యుయేట్‌, ప్రొఫెషనల్‌ కోర్సులు చదవాలనుకుంటున్న ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. రూ.5లక్షల వార్షికాదాయం, డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత, టోఫెల్‌, జీమ్యాట్‌ వంటి పరీక్షల్లో అర్హత, పాస్‌పోర్ట్‌ నందు వీసా అర్హత కలిగి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుటుంబలో ఒక్కరికే ఈ పథకాన్ని వర్తింపజేయనున్నట్లు వెల్లడించారు. అర్హులైన ఎస్సీ విద్యార్థులు ఈనెల 29లోపు దరఖాస్తుల చేసుకోవాలన్నారు.

● కవి సమ్మేళనానికి ఆహ్వానం

ఇల్లంతకుంట : శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు సాహితి కళాజాతర పేరుతో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో ఈనెల 19, 20న జరిగే కవి సమ్మేళనం కార్యక్రమానికి ముస్కాన్‌పేట గ్రామానికి చెందిన తునికి తిరుపతికి ఆహ్వానం అందింది. కవి సమ్మేళనంలో తిరుపతి కవితాగానం, అల్లూరి సీతారామరాజు, ఏకపాత్రాభినయనం చేయాలని వారు ఆహ్వాన పత్రికలో కోరారు.

● ఐకేపీ సెంటర్‌ ఏర్పాటు చేయొద్దు

వీర్నపల్లి: వన్‌పల్లి పంచాయతీ పరిధిలోని రామలక్ష్మణ పల్లెలో దళితులు నిరసన తెలిపారు. దాదాపు 25 ఏళ్లుగా తాము పోడు భూమిని సాగు చేసుకుంటున్నామని, గతేడాది ఐకేపీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని అధికారులు దాదాపు 15 ఎకరాల్లో హద్దులు ఏర్పాటు చేశారన్నారు. తాము పోడుభూమిలో పంటలు సాగుచేసుకునేలా చూడాలన్నారు.

● ఆర్థికసాయం అందజేత

వీర్నపల్లి: బంజేరు గ్రామానికి చెందిన గుగులోత్‌ సుభాశ్‌ (39) నెలరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. సుభాష్‌తో కలిసి మండలకేంద్రంలో 2000 సంవత్సరంలో చదువుకున్న పదో తరగతి స్నేహితులు కూతురు సోనాక్షి పేరుపై రూ.10,వేలు ఫిక్స్‌డ్‌ డిపాజిట్‌ చేశారు. ఇక్కడ హెల్పింగ్‌ హ్యాండ్స్‌ 2కే అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శులు లెంకల రాజు, చంద్రమౌళి, కార్యదర్శి కనకరాజు, కొమ్ము తిరుపతి, నక్క శ్రీనివాస్‌, జనార్దన, ఉన్నారు.

● హమాలీ చార్జీలు పెంచాలి

ముస్తాబాద్‌: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీ చార్జీలు పెంచి ఆదుకోవాలని ఏఎంసీ చైర్‌పర్సన్‌ తలారి రాణికి హమాలీ కార్మిక సంఘం నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. క్వింటాల్‌కు రూ.60 ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు మిద్దె నర్సయ్య, రాజు, భూమయ్య, బాలయ్య, ఎల్లయ్య తదితరులు వినతిపత్రం అందించినవారిలో ఉన్నారు.



ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌ గ్రామ శివారు మూడు రోడ్ల జంక్షన్‌ డేంజర్‌గా మారింది. వెంకటాపూర్‌ నుంచి సిరిసిల్ల రగుడు వరకు బైపాస్‌ రోడ్డును నిర్మించారు. కొత్తగా ఏర్పాటైన ఈ జంక్షన్‌ వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో రోజూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జంక్షన్‌ దగ్గర కనీస భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో ఇటీవల ఇద్దరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూడు రోడ్ల జంక్షన్‌ వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : కిరణ్‌, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, ఎల్లారెడ్డిపేట: ఫోన్‌ నంబర్‌ : 9440818864

వాట్సాప్‌ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్‌ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్‌ నంబర్‌: 9440243048, 9705346626

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

సిరిసిల్లటౌన్‌: రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. బుధవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. తక్షణమే కొనుగోళ్లు ప్రారంభించి మూడు వారాల్లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలన్నారు. నాయకులు సుదర్శన్‌, నాగరాజు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందిస్తాం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్‌ రాణి

ముస్తాబాద్‌: రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏఎంసీ పాలకవర్గం కృషిచేస్తోందని చైర్‌పర్సన్‌ తలారి రాణి అన్నారు. మండలంలోని పోతుగల్‌ ఏఎంసీ సర్వసభ్య సమావేశం బుధవారం చైర్‌పర్సన్‌ తలారి రాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైస్‌ చైర్మన్‌ వెలుముల రాంరెడ్డి, కార్యదర్శి హరినాథ్‌, డైరెక్టర్లు ప్రతాప్‌రెడ్డి, కుమార్‌, యాదగిరిరెడ్డి, ఉన్నారు.

ఫైనాన్స్‌ వేధింపుల నుంచి కాపాడాలి



తంగళ్లపల్లి: మండెపల్లి డబుల్‌ బెడ్‌రూం సముదాయం (కేసీఆర్‌ నగర్‌)కు చెందిన ప లువురు మహిళలు బుధవారం తంగళ్లపల్లి పో లీస్‌స్టేషన్‌కు వచ్చారు. పలు ప్రైవేట్‌ ఫై నాన్స్‌ల వద్ద చిన్న మొత్తంలో రుణం తీసుకున్నామని, చెల్లించేందుకు సమయం ఇవ్వాలని ఫైనాన్స్‌ కంపెనీ ప్ర తినిధులను కోరినా తమను వేధిస్తున్నారని వాపోయారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

వేములవాఅర్బన్‌: పట్టణంలోని ఓ ప్రైవేట్‌ పాఠశాలలో విద్యార్థిని ఓ ఉపాధ్యాయుడు చితబాదిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థి చెవిపై కొట్టడంతో చెవి నుంచి రక్తం కారడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చేర్పించారు. విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై విద్యార్థిని తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

కారు డ్రైవర్‌పై కేసు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌ వద్ద మంగళవారం జరిగిన ప్రమాదంపై బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్‌ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన కొత్తపల్లి బాబు, కొత్తపల్లి వెంకటేశ్‌ మంగళవారం బైక్‌పై సిరిసిల్లకు వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కారు డ్రైవర్‌ సైదాపూర్‌ మండలం సోమవారం గ్రామానికి చెందిన దొనికెన రాజేశంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సిరిసిల్లటౌన్‌: మున్సిపల్‌ పాలకవర్గం పారదర్శకతమైన విధానాలు, ఎమ్మెల్యే కేటీఆర్‌ సహకారంతో సిరిసిల్ల పట్టణం అభివృద్ధిలో ముందంజలో ఉందని చైర్‌పర్సన్‌ జిందం కళ అన్నారు. 18వ వార్డులో రూ.5లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అన్నివార్డుల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్‌ మంచె శ్రీనివాస్‌, కౌన్సిలర్లు గుండ్లపెల్లి రామానుజం, సెస్‌ డైరెక్టర్‌ దార్నం లక్ష్మీనారాయణ, మున్సిపల్‌ ఏఈ నర్సింహస్వామి పాల్గొన్నారు.

చెరువు మట్టిని తరలించొద్దు

- అధికారులకు రైతుల వినతి

వేములవాడరూరల్‌: వేములవాడ మండలంలోని మర్రిపల్లి చెరువు మట్టిని తరలించకుండా చూడాలని బుధవారం వేములవాడరూరల్‌ తహసీల్దార్‌ సుజాతకు రైతులు వినతిపత్రం అందజేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు 2009లో మినీ రిజర్వాయర్‌ నిర్మించేందుకు రైతుల నుంచి భూసేకరణ చేసి పూర్తిగా నష్టపరిహారం చెల్లించలేదన్నారు. 2024లో మళ్లీ భూసర్వే చేసి భూములకు, బావులకు ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు. చెరువు నుంచి మట్టిని తరలించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రిజర్వాయర్‌ పనుల్లో భాగంగా చెరువు కట్టకు సంబంధించిన రాయిని తీయడం వల్ల కట్ట ప్రాంతంలో ఉన్న రైతులకు లీకేజీ నీరుతో పంట పొలాలు దెబ్బతింటున్నాయని తెలిపారు.

అడ్డుకుంటే తాటా తీస్తాం..

మర్రిపల్లి చెరువు నుంచి మట్టి తీసేందుకు రైతులు సహకరించాలని, అడ్డుకుంటే ఊరుకునేది లేదని.. తాటా తీస్తామని రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులు హెచ్చరిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. వారం క్రితం మర్రిపల్లిలోని చెరువు నుంచి మట్టి తరలించేందుకు ట్రాక్టర్లతో అధికారులు వెళ్లగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు తిరిగి వెళ్లారు. ఈ విషయంపై పోలీసులు, రెవెన్యూ అధికారులు రెండు రోజులుగా గ్రామంలోని కొందరికి ఫోన్‌చేసి మట్టి తరలింపును అడ్డుకుంటే తాట తీస్తామంటూ హెచ్చరిస్తున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులను కాపాడాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. వేములవాడలో మాత్రం అధికారుల తీరుపై వారంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పోగొట్టుకున్న బంగారం అందజేత

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలం కందికట్కూర్‌ ఎల్లమ్మ ఆలయం వద్ద పోగొట్టుకున్న బంగారు బ్రాస్లెట్‌ను ఇల్లంతకుంట ఎస్సై శ్రీకాంత్‌గౌడ్‌ బాధితునికి బుధవారం అందజేశారు. వేములవాడకు చెందిన వంతెన బాబు కందికట్కూర్‌ ఎల్లమ్మ మొక్కులు చెల్లించుకోవడానికి మంగళవారం వచ్చాడు. ఆలయ పరిసరాల్లో చేతికి ఉన్న బంగారు బ్రాస్లెట్‌ పోగొట్టుకున్నాడు. బంగారు బ్రాస్లెట్‌ దొరికిన వ్యక్తి 100 నంబర్‌కు కాల్‌ చేసి వివరాలు చెప్పాడు. ఇల్లంతకుంట బ్లూకోల్ట్‌ కానిస్టేబుల్‌ జీవన్‌ సంఘటన స్థలానికి వెళ్లి బంగారు ఆభరణాన్ని తీసుకొని పోగొట్టుకున్న వ్యక్తి వివరాలు సేకరించారు. బుధవారం బాధిత వ్యక్తికి ఎస్సై శ్రీకాంత్‌ గౌడ్‌ చేతుల మీదుగా అందజేశారు.